

# నిర్మలాప్రకాష్

శివకోటి సత్యనారాయణమూర్తి

"ప్రకృతి విచిత్రమయినది. చాలా శోభాయమానమయినది కదూ" "సంధ్యారాగంలో అరుణ కాంతులు, నదీ తరంగాల సువర్ణకాంతులు ప్రణయ హారతులై చిరుగాలి సయ్యాటలలో సంపెంగ సువాసనలతో, గగన విహంగాల విహారం, పక్షికూనల కిలకిలారావం ఆ పల్లెపడుచుల నడకలలో వయ్యారం, కలువకన్నియ సోయగాల ఆస్వాదనకై అరుదెంచు శశికుమారునికి సుస్వాగతం చెప్పుతూన్నట్టుంది కదూ! సృష్టికారుని కళావైపుణ్యానికిదో చిహ్నం". "నిర్మలా! అదేః సిగ్గుపడుతున్నావా ? సిగ్గెందుకు! ప్రకృతి సౌందర్యానికై పరవశమా ? నా ఆశుకవిత్వాన్ని గేలి చేయటమా? అబ్బ! మాట్లాడవేం? ఓహో! ఆ చిరునవ్వులో ఆ వాలుచూపులో, ఆ జడకుచ్చు సవరింపులో, ద్యోతకమయ్యే భావం నేనూ తెలిసికోగలను లే నిర్మలా! అయినా నా దగ్గర సిగ్గెందుకు ? కొత్త కనుక ? అవి అనాగరికపు పద్ధతులు. నవనాగరిక యుగంలో యివి అసహ్యంగా కూడా వుంటాయి. చదువూ, సంస్కారమూ వున్న నీవు కూడా యిదే పద్ధతి అవలంభించడంలో అందంలేదు. అర్థంలేదు. ఏమంటావ్ ?"

'సౌందర్యోపాసనకు నునుసిగ్గు ప్రథమ సోపానము"

"ఆ! అలాగా! అయితే అది పురుషులకు లేదేః?"

"స్త్రీ సౌందర్యోపాసనతో శృంగార భావనలో తాను తృప్తిపడి పురుషులను తృప్తిపరుస్తుంది"

"నిర్మలా! స్త్రీ ప్రణయ దేవతే నిజంగా, స్త్రీ సౌందర్యకాంతుల్లోనే యీ ప్రకృతి పుంగవిస్తోందనిపిస్తూంది. ఏదయినా మానవ జీవితంలో యిలాంటి ప్రణయఘట్టాలు మరుపు రాని మధుర స్వప్నాలు. అవునా ?"

"ఏదయినా జీవితమే ఒక స్వప్నము."

"నిర్మలా! అది సరేగాని నన్ను వివాహం చేసుకోవేముందు నాగురించి నీకేం అభిప్రాయం కలిగిందో చెప్పు ?

"ఆ ప్రశ్నకు సమాధానం మీరే చెప్పాలి."

"నీ అనుభూతిని నేనెలా చెప్పేది ?"

"నన్ను గురించి మీకు కలిగిన అభిప్రాయమే నాకూ కలుగ వచ్చుగా ?"

"ఊఁ! చమత్కరిస్తున్నావే!"

"చమత్కారం చానల కలంకారం!"

"యూనివర్శిటీలో కూడా నీవిలాగే మాట్లాడే దానివన్నమాట ?"

"అలాగని మీకెవరు చెప్పారు ?"

'నీకంటిలో పాప నాకంటిలో ఆడుతూ అన్నాడులే!"

"అలాగా ? వూఁ! అదే . . . . ."

"ఏం? ఇది చౌర్యమా ? . . . . ."

"కాదు. మీ పరాక్రమమే!"

"కా పోతే నిర్మలా స్వయంవరంలో విజయుణ్ణి కావడః . . . . ."

"ఆఁ మీ పరాక్రమానికి ఆనవాలే! స్వీయ కావ్యాలు వల్లించడం మీకు వినోదం."

"ఆకావ్య రసాస్వాదన వారి హృదయేందిరలకః కూడా మెచ్చులే!"

"వూఁ చిలిపితనం ?" . . . . .

" . . . . . శృంగారానికో చిహ్నం కాదు ?"

"ఆ! అలాగే! . . . "అతి సర్వత్రవర్జయేత్"

"ఆ మాట కలువరాయునికి చెప్పు."

"వూఁ! . . . . ."

"అప్పుడే లేచావేః నిర్మలా ? వివాహమయిం

తర్వాత ఇంత స్వేచ్ఛగా ఏకాంతంలో కలిసికో గలిగిందీరోజేగా ? నీతో ఏవేవో మాట్లాడాలని, గతించిన జీవితంలో గడిచిన మధుర స్వప్నాలను నీతో చెప్పుకోవాలని, నేనెంతో ఉబలాటపడు తుంటే. నువ్వు . . . . .''

''ఏం లేదు. రాత్రి చాలా భాగమయిందని!

''ఏం ఫరవాలేదు. ఈ పల్లెటూళ్లో మన మేం దారి తప్పిపోం లే''

''దారి తప్పేటప్పుడు ఎక్కడేనా తప్పిపోవచ్చు''

''మాటకు మాట సమాధానం చురుగ్గా కూడ వుంటుంది!''

'అదికాదు ప్రకాష్! మామయ్య వచ్చాడా. అతనితో కాస్సేపైనా మాట్లాడలేదు. ఏమను కుంటాడో! ప్రత్యేకించి నన్ను చూడాలని వైజాగ్ నుంచి ఆయన వస్తే యెంగక్కేమాత్రైనా తెలిసి కోడానికి వీల్లేక పోయింది. అతను నాకోసం ఎదురు చూస్తుంటాడు. మానాన్న కూడా కంగారు పడుతుంటారు''

''అదేం నిర్మలా ? ఈ మాత్రానికే!''

''ఏదైనా పట్టణాలలో వుండే స్వేచ్ఛ, స్వాతంత్ర్యం పల్లె ప్రాంతాలలో చాలా తక్కువ. మనం ఇక్కడ ప్రాంతీయ పద్ధతులు అలవర్చు కోవాలిగా ?''

''మీ మామయ్యమీద వుండే ప్రేమలో సగమైనా నామీద వుంటే నేను చాలా అదృష్ట వంతుణ్ణి.''

''అంత రోషం దేనికి ? ఎవరి మీద వుండే ప్రేమ వారిమీదే వుంటుంది. అయినా ఒక్కొ క్కరికి ఒక్కొక్కరిపై ప్రత్యేకాభిమానం వుండ డం సహజం. అలాగని ఇంకొకరిని విశ్వసించడం లేదనుకోవడం పొరపాటు''

''అవును. తొందరగా నేనే పొరబడ్డాను. అవునూ . . . . మీ మామయ్య ఏమి చేస్తుం టారు ?''

''ఏం చేసినా, చెయ్యగలిగినా అతని జీవితమే చాలా అధ్వాన్నమయింది. తగిన సిరిసంపదలు, చదువు, సంస్కారాలు ఉన్నప్పటికీ, అతనికి తృప్తిలేదు. శాంతిలేదు. అందుకు బాధ్యత అతనిది కాకపోయినా, బాధ అతనిదే. అతన్ని చూస్తుంటే నాకు చాలా బాధగా ఉంటుంది. నా చదువు విషయంలో మానాన్న మొదట చాలా అయిష్టంగా వుంటే అతనే మానాన్నగార్ని ఒప్పించి విశాఖపట్నంలో యూనివర్శిటీలో చేర్పించి నావిష యంలో ప్రత్యేకశ్రద్ధతో,ఆసక్తితో చదివించాడు. అంతేకాదు. నేను ఎమ్. ఎస్‌సి. ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణురాలనయానంటే అతని ఆనందం చెప్పడానికి వీల్లేక పోయింది. ఆ తరువాత నా ఉద్యోగం కోసం అతనెంతో తాపత్రయ పడి ఎంతో సొమ్ము ఖర్చుచేసి యూనివర్శిటీలోనే నాకీ లెక్చరర్ పోస్టు వేయించి ప్రత్యేక శ్రద్ధా సక్తులతో నన్ను,నా జీవితాన్నీ గురించి శ్రమపడు తుంటాడు. ఆ వ్యక్తిని నేను ప్రత్యేకించి అభిమా నించడం సహజం. ఆవిషయాన్ని మీరన్వయించు కోవడంలో పొరపాటు పడ్డారనుకుంటాను.''

''అవును. అయినా నీవింతవరకూ విశాఖ లోనే వున్నావుగా ?''

''అవును. ఉన్నాను. ఉంటే ?'' కోపంగా ప్రకాష్ కళ్లల్లోకి చూస్తూ నిర్మలన్న మాటలకు ప్రకాష్ సమాధానం ఇవ్వాయలేదు.

2

''అమ్మాయి! నిర్మలా! నీ ఉద్యోగానికి రాజీ నామా యిచ్చేయాలమ్మా!''

''అదెందుకు నాన్నా?'' కొంచెం బాధగా నిర్మల అంది.

''ఏంలేదు. నీకు వివాహమయింది. అబ్బాయి పెద్ద ఉద్యోగి. మీరుభయులు ఒకేచోట ఉండడం అవసరం. అంతేకాదు. మన సాంప్ర దాయం ప్రకారం, భార్య భర్తను అనుసరించవలసి వుంది. యిద్దరూ ఉద్యోగాలు చేస్తూ విశాఖలో ఒకరు, చెన్నపురిలో ఒకరూ ఉండడం, వివాహి తులై వేరువేరుగా ఉండడం లోకం సహించలేని విషయం'' ఇష్టాకష్టంగా చెప్పలేక చెప్పలేక చెప్పాడు ముసలాయన.

''నాన్నా! ఉద్యోగం మానాలని నాకు లేదు. యీ విషయంలో మీరు నన్ను బలవంతం చెయ్య రనుకుంటున్నాను.'' సౌమ్యంగా, సమాధానపరచే ధోరణిలో నిర్మలీమాటలంది.

కాని తండ్రికీ మాటలు కఠినంగా విని పించాయి. ఆయన బాధతో అన్నారు. ''అమ్మా! ప్రపంచంలో మానవులకు కొన్ని బాధ్యతలంటూ వున్నాయి. వాటిని ఎదిరించడానికి గాని, వ్యతి రేకించడానికి గాని మానవుడు సాహసించకూడదు. అంతేకాదు. సాహసించలేడు కూడా. నీతండ్రిగా నాకు,నాకుమార్తెగా నీకు కొన్ని బాధ్యతలున్నాయి. అదే నీ వివాహము, వైవాహిక జీవితమునకు సంబం ధించినవి. వయస్సువచ్చిన పిల్లవు. నీతో మాట్లా డ్డానికి నాకెందుకో బాధగా వుంటూంది. అయినా నీబాధ్యత నీకు తెలియుంది కాకపోయినా, నీబాధ్య తను గుర్తించి నీవు యీ వుద్యోగం మాని యీ సెలవులలోనైన ప్రకాష్‌తో చెన్నపురిలో కాపురం పెట్టవలసియున్నది. యిది తప్పదు. నా మాటలో అర్థం నీకు బోధపడగలదనే నేను అను కుంటున్నాను.''

''కొంచెం ఆలోచించి చెప్తుతా నాన్నా!'' ముక్తసరిగా సమాధానం చెప్పేసి తప్పించుకొంది నిర్మల.

''ఇప్పుడు తనేం చేయాలి? ఏం చేస్తే బాగుంటుంది? తాను ఉద్యోగం వదలి భర్తతో సంసార నిర్వహణ భారాన్ని భరించడమా? సాంఘి కంగా సమాజానికి కొంత సేవచేయడమా? అనేక దశాబ్దాలుగా సంఘంలో స్త్రీకి, స్వాతంత్ర్యం లేకుండా పోయింది. స్త్రీ ఒక విలాస వస్తువని, కుటుంబ నిర్వహణకై పురుషులకోసం నిర్ణయింప బడిన ఒకపరిచారిక యని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేని ఒక బానిసగా సంఘం గుర్తించి యిలా శాసిం చింది. కాని ఆరోజులు మళ్ళాయి. స్త్రీజాతికి స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు, సమాన ప్రతిపత్తితోపాటు ప్రస్తుత తరుణంలో దేశపురోభివృద్ధికి మహిళా శక్తి అత్యంతావశ్యకమయిందిగా ప్రభుత్వం గుర్తిం చింది. స్త్రీలకు అవకాశాలు లభిస్తున్నాయి. కాని వాటిని పూర్తిగా వినియోగించుకోవడానికి స్త్రీకి స్వాతంత్ర్యం లేకపోతోంది. ప్రతి స్త్రీ విషయంలో నాస్థితే గోచరిస్తోంది. చదువుకొని, ఉద్యోగంలోకి ప్రవేశించేటప్పటికి వెంటనే వైవా హిక సమస్య తలెత్తింది. దాన్ని ఎంతగా వ్యతిరే కించినా, ఎదిరించగలిగినా, తుదిక్షణంలో నా తండ్రి మాట కాదనలేకపోయాను. ఆ రోజు కూడా నే ఆలోచించగలిగినంతవరకూ, ఆలోచిం చాను. ఎదిరించగలిగినంత వరకూ ఎదిరించాను. కాని నేను పరిస్థితులకు బానిసనయాను. యిప్పుడు తిరిగి అదే సమస్య తలెత్తింది. నేనేం చెయ్యాలో నాకేం తోచడంలేదు.''

''ఇటు తండ్రి నా భవిష్యత్తుపై ఆశతో, వాత్సల్యమున్న కిసం సర్వస్వం ధారపోసిన త్యాగి. ఆయనను మన్నించాలి. అది నా ధర్మం. యింక అటు భర్త. అగ్నిసాక్షిగా ''అర్థేచ కామేచ..'' అని ప్రమాణంచేసి వారి హృదయ మందిరంలో ప్రణయమూర్తిగా మౌనంగా నిలువవలసింది నేను. అంతేకాదు. గాఢ ప్రేమానురక్తులై నాకోసం ఆశగా, ఊహామందిరాలలో నన్ను ప్రతి ష్ఠించుకొని, ఆరాధించుకొనే నాభర్త కోరికను మన్నించడం కూడా నాకర్తవ్యమే.''

''అదేకాదు. ''పతిత జనోద్ధరణ'' అతిముఖ్య సమస్య కూడా. అనేక సంవత్సరాలుగా ఆడది స్వాతంత్ర్యాన్ని కోల్పోయి, బానిసగా, సేవకు రాలుగా, నికృష్టజీవితం గడుపుతూవుంది. యిది కేవలం మగజాతి స్వార్థంతో మగువలపై కత్తికట్టి కసి తీర్చుకుంటున్నట్టుగానే ఉంది. లేకపోతే పురుషులతో సమాన బాధ్యత, కర్తవ్యం, కార్యదీక్ష, కలిగియున్న స్త్రీని నీచంగా, హేయంగా చూస్తూ, క్రూరంగా హింసిస్తున్నారంటే స్వార్థ పరత్వానికి వేరే తార్కాణమేం కావాలి? పురుషు లకు స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వుంది. ఏపని చేయా లన్నా వారికి స్వతంత్రతం వుంది. స్త్రీ కది లేదు. ఆఖరికి తన పుట్టింటి కెళ్ళాలని వున్నా ఆడది భర్త అనుమతి, అంగీకారం పొందితేకాని వెళ్లే అవకాశం లేదే! యీ పరిస్థితిలో స్త్రీ తనలోని ఉత్సాహాన్ని, ఆనందాన్ని, ఆశయాలని అణచుకొని, అవి కేవలం భర్తకోసం, భర్త తృప్తి కోసం త్యాగం చెయ్యాలి. చెయ్యవచ్చు. కాని త్యాగమూర్తికి ఏ స్థానాన్నివ్వాలో అర్థం చేసుకో లేకపోతున్నది సంఘం. యిల్లాంటి పరిస్థితుల్లో, మహిళలంతా ఏకమై పురుషులతో సమానంగా అన్ని కార్యక్రమాల్లోను పాల్గొని, తన శక్తిని, ఉత్సాహాన్నీ ప్రదర్శించి, స్వార్థమూర్తుల హృద యాల్లోని కుళ్ళును క్షాళనం చేసి స్త్రీజాతికి విముక్తి కల్పించి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలను స్థాపించవలసిన తరుణంలో, ఉన్న కొద్ది మంది స్త్రీలూ యిదేవిధంగా కుటుంబ వ్యవహారాల కార ణంగా సమాజానికి సేవకూ దూరమయితే యీ సంస్థ పురోభివృద్ధి చెందడం ఎలా? ఎప్పటికిది తన హక్కులను సాధించగల్గడం జరుగుతుంది? ఏమయినా తనను తాను రక్షించుకుంటో, తన

సమాజాన్ని రక్షించగలగడమే మానవ జీవితపు విలువ. యిందుకై తగు ప్రయత్నము చేయ వలసిందే.''

''అయితే నాన్నకు ఏం సమాధానం చెప్పాలి? తనకోసం తన జీవితాన్నే త్యాగం చేసుకొన్నాడు తండ్రి. తన తల్లి పోయిన రోజుల్లో, నలుగురూ మళ్ళీ వివాహం చేసుకోమని బలవంతం చేసినా యీ కుర్రదాని భవిష్యత్తుకు భంగం వస్తుందని ఆయన తన ప్రయత్నం విరమించి తన్నింతదాన్ని చేశాడు. యిప్పుడు ఆయన చెప్పిన మాటలు తృణీకరిస్తే ఆయన వదులుకున్న ఆశలు, చేసిన త్యాగానికి విలువలేకపోయిందనే దిగులుతో, ఎంతో బాధపడుతారు.''

''అయితే ప్రకాష్ విషయం ఏమిటి? ఆయన తనవెంతగానో ప్రేమిస్తున్నారు. తను లేందే ఆయన జీవితం లేదు. తనని వదిలి ఒక్కక్షణమ యినా గడుపలేని స్థితిలో యున్నారు. కల్మషం లేకుండా తనను నమ్మిన వ్యక్తి ప్రకాష్. ఆయ నతో తాను జీవితం గడపాలని శాసించింది సంఘం. తానూ అలాగే ఆశిస్తుంది. తాను యీ విషమ పరిస్థితుల్లో ఏదో ఒక నిర్ణయానికి రావాలి. యిటు వుద్యోగం వదిలి జాతిసంక్షేమ కార్యకలా పాలను త్యజించి, సామాన్య హైందవ స్త్రీగా భర్తతో కాపురం చేస్తూ, పిల్లల్ని కంటూ, వంటిల్లు చక్కబెట్టుతూ, తన ఆశలను, ఆశ యాలనూ త్యాగం చేయడమా? తనకోసం తన సౌఖ్యాన్ని త్యాగం చేసిన తండ్రికోసం, తనతో మధుర జీవిత ప్రాంగణంలో, అనురాగమయ జీవితాన్ని ఆశించే భర్తకోసం, తన జీవితాన్ని అంకితం జేయడమా?''

''ఉద్యోగం వదిలివేయడం తేలిక. సమాజా న్నుంచి తప్పుకోవడం అంతగా కష్టమయింది కాదు. కాని సంసారాన్ని, భర్తనూ వదలడం చాలా కష్టమయిన పని. యిది సాంఘికంగా, రాజకీయం గానే కాకుండా, మానసికంగా కూడా తాను నిర్వ ర్తించలేని పని. తాను ఎంతసేవ చేయాలను కున్నా, తానెంత స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను వాంఛి స్తున్నా, తానెంతగా స్వార్థపరుడయిన పురుషుని చర్యలను గర్హిస్తున్నా, తనకూ కొన్ని ఆశలున్నాయి. తనకూ, భర్త అనురాగాన్ని, ఆనందాన్ని పెంచుకో వాలనీ, పంచుకోవాలనే కోరిక ఉంది. యీ చిక్కు నుండి విడివడటం చాలా కష్టంగా వుంది. ప్రతి స్త్రీ ముందు తనలాగే ఆశిస్తుంది. సమాజ శ్రేయస్సు, స్త్రీస్వాతంత్ర్యం విధిగా కోరుతుంది. సంఘంలో తాను కూడ వ్యక్తిగా నిలవాలని ఉబ లాటపడుతుంది. కాని ఆమె ఉత్సాహాన్నీ, ఉద్రే కాన్నీ అణచివేస్తుందీ జీవిత సమస్య.''

''యీ సమస్యను రెండు విధాలుగానూ సమాధానపరచుకొని సాధించుకోవడం అవసరం. అందుకు తాను ఒకరకంగా ప్రయత్నిస్తే ఫర్వా లేదు. భర్త అంగీకారం మీద యిటు సమా జానికి సేవజేయడం, అటు భర్తతో సంసారాన్ని నిర్వర్తించడం సులువయిన మార్గం. ఇదివారి ఆమోదం మీద ఆధారపడే సాధించడమే యుక్త మవుతుంది. శెలవులాఖరు వరకూ ఎందుకు?



సరళ: ఏమే పద్మా ఇన్నాళ్ళు 'ప్రేమ ప్రేమ' అంటూ ఉప న్యాసాలిచ్చి ఇప్పుడు డబ్బున్న వాణ్ణి చేసుకొంటున్నావా:

పద్మ: అది కాదే పిచ్చిదానా! బాగా డబ్బున్న వాడికీ,అసలు లేని వాడికీ బాలెన్సుండదు జీవితంలో. అందువల్ల ఒక మోస్తరు డబ్బున్న వాణ్ణి సెలెక్టు చేసుకొన్నానే...

యీలోగానే మద్రాసు వెళ్ళి అచట కాపురం పెట్టి కొని వుంటేనే మంచిది. యీలోగా వారి ఆమోదంతో సెలవులాఖరున తిరిగి వుద్యోగంలోకి వెళ్ళొచ్చు. యీలోగా రాజీనామా ప్రశ్నే లేదు. యిదే సరయిన మార్గం.'' చివరికీ నిర్ణయమ్మే బాగుందని తోచింది నిర్మలకు.

## 3

''చెన్నపురిలో చెప్పుకోతగిన బీచిలలో యీ మెరీనా ఒకటి. పగలల్లా పరిశ్రమించిన మేధా వంతులకు, కష్టజీవులకూ సౌఖ్యాన్నీ, సుఖశాంతు లనూ, చల్లని శీతవాయువులమా ప్రసాదించి తృప్తిపరచేదీ యీ వనమే. యింతకు ముందు నీవిది చూసియుండవనుకుంటాను. యింతకు ముందు నీవు మదరాసు వచ్చావా?'' నగరంలోని వింతలూ, విశేషాలూ, విచిత్ర ప్రదేశాలూ చూపిస్తూ ఎంతో ఆప్యాయతగా ప్రకాష్ అడిగిన దానికి నవ్వుతూ ''మద్రాసు మీస్వంతంలా భావి స్తున్నారే'' చలోక్తిగా తిన్నెమీద కూర్చుంటూ అంది నిర్మల. ఆమాటకు ఏమనుకున్నాడో గాని ప్రకాష్ వెంటనే సమాధానమీయలేదు. కొంతసేపు మౌనంగా ఉండిపోయారిద్దరూ.

మౌనంలో చాలాసేపు గడిపాక ముందుగానిర్మలే అంది. ''మిమ్మల్ని ఒక ముఖ్య విషయం అడగా లనుకుంటున్నాను, దాపరికం లేకుండా సమా ధానం యిస్తారా?'' అని. ''వూ'' అన్నాడు పర ధ్యానంలోంచి త్రుళ్ళి పడుతూ ప్రకాష్ అదేమిటనే ధోరణిలో ఆమెకేసి చూస్తూ.

''సంఘంలో పురుషులతోపాటు స్త్రీకి సమాన ప్రాతినిధ్యం ఉండాలనే వాదనను మీరెంత వరకూ బలపరుస్తారు?'' జంకుతూ అతని నుంచి వచ్చే సమాధానం కోసం ఆత్రుతపడుతూ అడి గింది.

''అనేక సందర్భాలలో ఉభయులూ సమాన ప్రాతినిధ్యం కలవాళ్లే అవుతున్నారు.'' ముక్త సరిగా చెప్పాడు ప్రకాష్. యీ సమాధానం నిర్మ లకు నచ్చలేదు. తృప్తి కలిగించనూ లేకపోయింది. కొంతబాధగా తిరిగి అంది. ''అదికాదు. స్త్రీ స్వాతంత్ర్యాన్ని గురించి మీరేమంటారు? వాలుగా అతని కళ్ళల్లోకి చూస్తూ అడిగింది నిర్మల. కొంతసేపు మౌనం పాటించి ''స్వాతంత్ర్యాన్ని బలపర్చడానికి, ఆ స్వాతంత్ర్యాన్ని వినియోగపర్చు కోవడానికి విశాల హృదయం అవసరం'' మామూలు ధోరణిలో సమాధానమిచ్చి యింత టితో ఈవిషయాన్ని ముగించాలనే సంకల్పంతో 'తిరిగిపోదామా?'' అంటూ నిర్మల కళ్ళల్లోకి చూస్తూ, లేచాడు ప్రకాష్.

నిర్మల సిగ్గుపడింది. యీరోజు సంఘటన తనకేదో ప్రత్యేకమైన అవమానాన్ని కల్పించి నట్టుగా తోచింది నిర్మలకు. కాని ఏ భావాన్ని వ్యక్తం చేయకుండానే ''అలాగే'' అంటూ బయలు దేరింది.

ఆరోజుకు వారిద్దరూ నిస్సంకోచంగా మాట్లాడుకోలేకపోయారు. నిర్మలకు యిది మరీ బాధగా తోచింది. కాని ఏమన్నా వీలుకాని స్థితిలో ఉంది తాను. యిలాగా కొన్ని రోజులు గడిచాయి. రోజులు గడుస్తున్నకొద్దీ నిర్మల ఆత్రుత ఎక్కువవుతోంది. దాంతో ఆందోళన చివరకు చిరాకు కలగడం, యిలా వింత మన స్తత్వంతో బాధపడుతూ యుండేది. సంసార జీవితంలో తనకే కొరత, చింతలేక పోయినా, ముందుగా తన ఆశయాల ఆచరణను గురించి ఆవేదన ఎక్కువయింది. సమయం కోసం ఎదురు చూస్తుండేది. ఎందుకోగాని ఈ విష యాలని తలపెట్టేసరికి ప్రకాష్ అన్యమనస్కంగా వుంటుంటాడు. బహుశా ఆయనకది యిష్టం లేకపోవచ్చును. ఆదే నిజమయితే తనేంజేయాలి? ఎంతగా ఆలోచించినా తెగని సమస్య యిది. యిలా ఆలోచిస్తూ [illegible] నిద్రపోయింది నిర్మల. సాయంత్రం [illegible] యింటికి తిరిగివచ్చి ప్రకాష్ ''[illegible] ఒట్లో బాగాలేదా? [illegible]'' అనే ప్రశ్నలత [illegible] లేదు. ఇంగా [illegible], కాఫీ, ఫల [illegible] ఆరోజు నిర్మల [illegible] ప్రకాష్‌కు. కాఫీ కల్పుతూన్న [illegible] చూస్తూ ''ఏం నిర్మలా. ఒంట్లో బాగాలేదా?'' కొంచెం ఖంగారుపడుతూ అన్నాడు ప్రకాష్.''బాగానే ఉంది'' చిరునవ్వు అభి నయిస్తూ కాఫీ కప్పు అందిస్తూ అంది నిర్మల.

"అయితే అలా నీరసంగా వున్నావేం?" జాలిగా అడిగాడు ప్రకాష్. "ఏంలేదు. ఎందుకో నా మనస్సు బాగుండలేదు."

"అయితే సినిమాకి పోదాం రా. వెళ్లొద్దామా?" ప్రశ్నార్థకంగా ఆమె ముఖంలోకి చూస్తూ ప్రకాష్ అడిగిన ప్రశ్నకు కొంత తటపటాయించి "సినిమా చూడాలని నేననుకోవటం లేదు. ఏకాంతంలో మీతోనే కొన్ని ముఖ్యవిషయాలను గురించి మాట్లాడాలనిపిస్తోంది." ఓరకంటితో ప్రకాష్ కళ్ళల్లోకి చూస్తూ చిరుగా నవ్వుతో అంది నిర్మల. "అలాగా దానికి యింత నీరసించడం దేనికి? చెప్పదలచుకున్నదేమిటో నిర్భయంగా చెప్పుకో!" అత్యుత్సాహంతో చిటిక వేస్తూ అన్నాడు ప్రకాష్.

ఈ సమాధానం చాలారోజుల తర్వాత విన్నది అయితే తాను ఏవిధంగా యీ ప్రసంగాన్ని ప్రారంభించాలో తోచక కొంతసేపు మౌనంగా కూర్చొని "ఏమీ లేదు. శలవులు పూర్తవుతున్నాయి కనుక ఉద్యోగం గురించి మీతో......" చెప్పడానికి ధైర్యం చాలక చప్పరించేసి సమాధానం కోసం ఎదురు చూస్తోంది.

"నీ అభిప్రాయం నాకర్థమయింది నిర్మలా! ఈ మాత్రానికే సిగ్గు, భయం ఉండాలా? నాతోటే నీవు మనసిచ్చి చనువుగా మాట్లాడలేక పోతే నిజంగా నీవలా మాట్లాడడానికింకెవరుంటారు?" లాలనగా ఆమె ముఖంలోకి చూస్తూ మందహాసం చేస్తూ అన్నాడు ప్రకాష్.

ఈ మాటలు విన్న నిర్మల ముఖంలో మార్పు కలిగింది. ఆనందంలో ఆమె ముఖం వికసించింది. అత్యుత్సాహం అభినయిస్తూ "మీముందు మాట్లాడ్డానికి నేనెప్పుడూ భయపడడం లేదే!" అంది గతాన్ని కప్పిపుచ్చుకుంటూ.

"అది సరే. యింతకూ నీవుద్దేశ్యం ఏమిటి? తిరిగి మళ్ళీ జాయిన్ కావాలనా?" సహజధోరణిలోనే ప్రశ్నించాడు ప్రకాష్.

సూటిగా అడిగిన యీ ప్రశ్నకు సూటిగా "అవును" అని సమాధానమీయాలనిపించినా బాగుండదనే అభిప్రాయపడి "మీయిష్టం మీద ఆధారపడి మీరేం చేయమంటే అలా చేద్దామనుకుంటున్నాను." అంది.

యిలాంటి సమాధానాలు విన్నప్పుడు ఏం చెప్పాలో తోచకపోవడం సహజం. ఏమంటే ఎదుటివాళ్ల అభిప్రాయం అర్థంకాదు. దాన్ని వాళ్ల మాటల్నిబట్టి, చేష్టల్నిబట్టి, ముఖ కవళికలను బట్టి అర్థం చేసుకొని వాళ్ల అభిప్రాయాలతో ఏకీభవించేటట్టుగా మాట్లాడవలసి వుంటుంది. అలా చేస్తేనే వాళ్లు తృప్తి పడతారు. లేకపోతే వాళ్లకు వ్యతిరేకమయిన అభిప్రాయం చెప్తే వాళ్లు బాధపడుతారు. కొంతమంది పోట్లాడుతారు కూడా. అలాంటి స్థితిలో ప్రకాష్ దీర్ఘంగా ఆలోచిస్తున్నవాడిలా అభినయిస్తూ "చూడు నిర్మలా! నీ సుఖ,సంతోషాలకి, ఆనంద వినోదాలకి, నేనెప్పుడూ అడ్డు చెప్పాలని అనుకోవటంలేదు. అంతేకాదు. మనస్ఫూర్తిగా చెప్పాలంటే నీ ఆశలకి, ఆశయాలకి నేనెప్పుడూ వ్యతిరేకినిగాను. కాని యీ స్థితిలో నీకేం సమాధానం యీయాలో నాకు బోధపడ్డంలేదు. నిన్నుగురించి నాకుమంచిఅభిప్రాయాలే వున్నాయి. నీవు ఉద్యోగం చేసినా, ఉన్నత పదవులు నిర్వహించినా, నీ వ్యక్తిత్వాన్ని కోలుపోవనే విశ్వాసం నాకుపూర్తిగా వుంది. నీ అభిప్రాయాలెప్పుడూ పూర్తిగా బలపడ్డాలనే నేననుకొంటున్నాను. అదే నా ధ్యేయం కూడా. కాని ఒక్క పనిమాత్రం నేను చేయలేకపోతున్నాను. అదే ... అది ... నీకు దూరంలో ఏకాంతంలో ఉండలేకపోవడం ...!"

ఈ ఆఖరిమాట చెప్పలేక, చెప్పలేక చాలా బాధ పడుతూ గార్గదిక కంఠస్వరంతో చెప్పాడు ప్రకాష్. యింతకుమించి అతనేం చెప్పలేక పోయాడు. రుమాలుతో ముఖం తుడుచుకుంటూ ప్రక్కగా ముఖం పెట్టుకున్నాడు.

ఈ సంఘటన చూసిన నిర్మల హృదయంలో వింతమార్పు కలిగింది. ఆమె హృదయం జాలితో ద్రవించింది. ప్రకాష్‌ను గురించి యిటీవల కొద్ది రోజులుగా తప్పుగా అభిప్రాయపడుతూ వచ్చింది. అతను తటస్థంగా వుంటున్నాడని, అన్యమనస్కంగా నడుస్తున్నాడని, అతనికి తన మీద ఏదో ద్వేషం ఉందని అభిప్రాయపడుతూ వచ్చింది. అదంతా పొరపాటు. కేవలం అతను తనపైన ఉన్న ప్రేమను, అనురాగాన్ని, దూరంచేసుకోలేక బాధతో అలా ప్రవర్తిస్తూ వచ్చాడేగాని, తనపై అతనికెట్టి దురుద్దేశ్యము లేదు.

అయితే యిప్పుడు తనేం చేయాలి? వ్యక్తిత్వం నిలబెట్టుకోవడానికి, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను మాకూ వున్నాయి అని చాటుకోవడంకోసం, బానిసలుగా మగ్గుతూవున్న స్త్రీలను సంరక్షించి పరిదిద్దడంకోసం, తాను యీ వుద్యోగంలో ప్రవేశించాలి. నిజంగా ఆలోచిస్తే ఆజాతిసేవ చేయాలనుకుంటే ఉద్యోగం కావాలా? అక్కర్లేదు. కాని ఆడదికూడా ఆర్థికంగా తనూ సంపాదించుకోవాలనే ఆశయంతో తనీవుద్యోగం చెయ్యాలి. అంతేకాదు. ఉద్యోగంలో వుంటే వున్న పరిస్థితులు, విలువ ఆదారకంగా వుంటాయి. అది కేవలం సర్వస్వతంత్ర జీవితమార్గము.

భర్త ఎంత అనురాగ హృదయవర్తియైనా, కుటుంబ బాధ్యతలంటూ వుంటాయి కదా! వాని మూలంగానయినా కొంతవరకూ స్వాతంత్ర్యం వుండకపోవచ్చు. అంతేకాదు. భర్త సుఖ, సంతోషాలకోసమే ఇంచుమించుగా గృహిణి కాలాన్ని ఖర్చుచేయవలసి వుంటుంది.

ఏదయినా అనురాగమయ జీవితం కంటే స్వతంత్ర మేం కావాలి! హాయిగా భర్తతో మధుర జీవితాన్ని గడుపుతూ, ఒకరికష్టసుఖాలలో మరొకకరు భాగస్థులవుతూ, చక్కగా సంసారాన్ని సాగించుకోవటంలోనే తృప్తివుంది. యిదే స్త్రీకి సరియ్యైన మార్గం. సంసారాలు సాగటంలేదు, అంతఃకలహాలతో, అసూయాద్వేషాలతో ఆలుమగలు కీచులాడుకుంటున్నారంటే అది ఉభయత్రా వుండే దౌర్బల్యమేగాని, కేవలం ఒక పురుషుని అహంకారము, అధికారము అనడానికి వీల్లేదు. హృదయాన్నర్పిస్తే ఏ హృదయమైనా కరుగక మానదు.

"నేను ఉద్యోగం చేస్తుంటే ఆర్థికంగా వారికి సహాయపడగలను కదా! మా కుటుంబం ఆర్థికంగా ఎంతో పురోభివృద్ధిగా వుండునుగదా! అయితే అదెలా సాధ్యపడుతుంది. మాయిద్దరికీ ఒకే గ్రామంలో, ఒకేచోట ఉద్యోగాలిస్తారా? యిద్దరం కలిసి వుండాలనుకున్నప్పుడు ఎవరైనా ఒకరు ఉద్యోగం మానవలసిందే. అది నేనే చెయ్యాలిగూడా."

"ఏమంటే కుటుంబపోషణ, రక్షణ, పురుషుని బాధ్యతలు. కుటుంబ నిర్వహణ, గృహాలంకరణ, స్త్రీ బాధ్యతలు. యిది నగ్నసత్యం. అలా జరిగినప్పుడే జీవితంలో పూర్తి ఆనందాన్నీ, ఆనందాన్నీ పొందగలుగుతాం, ఆ ఆనందంలోని మాధుర్యం వూహాతీతం ... ..."

"సాంఘిక సంస్కరణకు హృదయ పరివర్తన అవసరం. యీ సమస్య ముఖ్యంగా హృదయ పరివర్తనకు సంబంధించిందేగాని ఉపన్యాసాల వల్ల, ఉపవాసాలవల్ల సాధించగలిగేది కాదు." ఈ ఆలోచనతో రాత్రి చాలాభాగం గడిచిపోయింది.

తన సమాధానంతో ఏకీభవించలేక పోతోంది నిర్మల, అనే ఉద్దేశ్యంతో ఏమీ చెప్పలేక మౌనంగా ఉండిపోయాడు ప్రకాష్. భవిష్యత్తును వూహిస్తూ, సుఖమయ జీవితపు వూహాజగత్తులో ఉర్రూతలూగుతూ, నిర్మల మౌనంగా వుండిపోయింది.

ఏదోవిధంగా నిర్మలతో మాట్లాడాలనిపిస్తూండేది ప్రకాష్‌కు. కాని ఆమె కోపంగా మాట్లాడతుందేమోననే అభిప్రాయంతో మాట్లాడలేక పోతూ, తన కాలకృత్యాలను నిర్వర్తించుకొని భోజనం పూర్తిచేసుకొని అలవాటు ప్రకారం "ఆఫీసుకు వెళ్లివస్తా నిర్మలా!" అన్నాడు జంకుతూ పెడముఖం పెట్టుకొని. "అయ్యాగారు అలిగినట్టున్నారు. కారణం?" "అబ్బే! లేదు నిర్మలా! నా సమాధానంతో నీవే ..... ....." అంటూ చప్పరించాడు. "లేదండి! నేను ఉద్యోగానికి రాజీనామా చేయాలనే సంకల్పించుకున్నాను. మీతో నా జీవితాన్ని గడపడంకంటే నాకా వుద్యోగం ఎక్కువేం కాదు" అంది ఉత్సాహంగా.

ఈ మాటలు వింటూనే నిశ్చేష్టుడైపోయాడు. నిర్మల యిలా నిర్ణయిస్తుందని అతను అనుకోలేదు. ఆమె మాటల్లోని కరుకుదనం ఆమె నడకలోని బింకం చూసినప్పుడల్లా, ఆమె తనను అనుసరిస్తుందనిగాని, నిజంగా ఆమె తన గృహిణిగా వుంటుందనిగాని అనుకోలేక పోతుండే ప్రకాష్‌ను యీ మాటలు ఆశ్చర్యపరచినాయి. కొద్దినిమిషాలు అలాగే నిలబడి "నేను నిజంగా అదృష్టవంతుణ్ణే నిర్మలా!" అంటూ ఆమె బుగ్గపై చిలిపిగా ... గిల్లాడు.

"మీ అదృష్టాన్ని తలుచుకుంటూ ఆఫీసు మరిచిపోకండి" పైపైపోతోందని జ్ఞాపకం చేయడంకోసం అంది నిర్మల.

"ఈ రోజు ఆఫీసుకు సెలవుపెట్టేస్తాను నిర్మలా!"

''అదేం?'' ఆశ్చర్యంగా నవ్వుతూ అంది.

''ఏం లేదు. నాకీరోజున కొన్ని ముఖ్యమైన, అత్యవసరమైన పనులున్నాయి''

''ఏమిటవి?''

''సెలవు దాఖలు చేసి మరీ చెప్తానులే''.

''చాలు! మీ తొందరపనులు ఆఫీసు నుంచి వచ్చిన తరువాత చూసుకోవచ్చు గాని, యిదుగో టీ ఫ్లాస్కు. యిక వెళ్ళిరండి. కాలం మించిపోతోంది' టీ ఫ్లాస్కు చేతికి తగిలిస్తూ నిర్మల అంది. మంత్రముగ్ధుడిలా తన సంతోషాన్ని తనే తలుచుకుంటూ ఆఫీసుకు వెళ్ళిపోయాడు ప్రకాష్.

## 4

నిర్మలా ప్రకాష్‌ల జీవితం చాలా హాయిగా ఆనందంగా గడిచిపోతోంది. నిర్మల ఆశించినదానికంటే హెచ్చుగా తన జీవితానుభవాలను పొందుతోంది. ప్రకాష్ ఆమె మాటకు ఎప్పుడూ ఎదురు చెప్పలేదు. ప్రకాష్ జీవితంలో స్వతంత్రంగా ఏదైనా చేయగలిగేది ఉందంటే అది ఆఫీసు పని మాత్రమే. మిగతా విషయాలన్నీ నిర్మల చూచుకుంటూండేది.

ఇప్పుడు ప్రకాష్‌కు బాధ్యతాయుతమైన ఉన్నతోద్యోగం కూడా లభించింది. అందుచేత కొన్ని కొన్ని ఆఫీసుపనులు కూడా నిర్మల యింటి దగ్గర చక్క బెట్టుతూ యుండేది. నిజంగా స్త్రీ బానిస కాదు. నిర్విరామంగా తను చేస్తూన్న పనివల్ల తనకెంతో తృప్తి. ఆనందం కలుగుతున్నాయి. కాని తనకేం కష్టంగా లేదే. దీన్ని కొంతమంది సరిగా అర్థం చేసుకోలేక, పురుషులు యావత్తు పనులు మనచే చేయించుకుంటున్నారని, ఇది బానిసత్వమని విమర్శించడం మొదలు పెట్టారు. అది క్రమేణా స్త్రీ స్వాతంత్ర్యమనే నినాదంగా తయారయింది. మంచిని మనస్సుకు పట్టించుకోలేని వాళ్ళెవరో అలాగ అంటుంటే అంతా అదే నిజమని భ్రమసిపోతున్నారు అంతే, అనుకుంటూండేది. తాను మహిళా సమాజ కార్యకలాపాలలో ఉండేటప్పుడు ''పతిత స్త్రీ జనోద్ధరణ, వార్షికోత్సవాలలో తాను ఉపన్యసించేటప్పుడు పురుషులను నిశితంగా విమర్శించేది. ఆ విమర్శనలు జ్ఞప్తికి తెచ్చుకొని తనలో తానే చాలా సిగ్గు పడుతూండేది.

''అబ్బ! అసూయా ద్వేషాలకెంత విలువ వుంది. అది మానవ జీవితాన్ని తుడిచిపెట్టేస్తాయి నిజంగా. ఆ అసూయ చేతనేగదా యీ సమాజాలు బయలుదేరింది. కుటుంబ నిర్వహణలోని తృప్తిని, భర్త అనురాగంలోని అనుభూతిని పొందలేని వాళ్ళు, పొందడం చేతకాక అసూయాపరులై యీ రకంగా కత్తికట్టి కాలుదువ్వి జీవితాలను నాశనం చేస్తున్నారు. కాని దీనివల్ల రాగమయ జీవితాలెన్ని అసూయాద్వేషాలకంకితమై విడిపోయాయో''.

''అంతవరకూ దేనికి? నాస్థితి ఏమిటి? నిజంగా నేను ఆ సమాజమంటూ, ఆ ఉపన్యాసాలే వల్లెవేసుకుంటూంటే నాకు ఒరిగేదేముంది? నాకొచ్చేదేముంది? మహా వస్తే సమాజానికి అధ్యక్షురాలిని చేస్తారు. పూలమాలలు వేస్తారు.



భార్య: (భర్తతో) ఏమండీ! నేనిప్పుడు సరిగ్గా పాతికేళ్ల పడుచు పిల్లలాగా లేను?....
భర్త: అప్పుడే కాదు. ఇంకొక్క పదేళ్ళు పోవాలి ............

జై అంటే జై అంటారు. కాని నాకా సమయంలో ఈ తృప్తి, ఈ అనుభూతి ఎలా కలుగుతాయి? ఎలా వస్తాయి?'' అనుకుంటూండగా ఎవరో వస్తూన్న అలికిడికి తృళ్ళిపడి వీధికేసి చూసింది. తన కళ్ళను తానే నమ్మలేకపోయి ఆశ్చర్యంగా ''రా! మామయ్యా! కులాసాయేనా?'' పమిట సవరించుకుంటూ కుర్చీ చూపించింది నిర్మల.

''కులాసాయే. చాలా రోజులయిందికదూ, ఒకసారి చూచి పోదామని యిలా వచ్చా'' అవ్యక్తమయిన బాధను దిగమింగుతూ మామయ్య అన్న మాటలకు నిర్మల ఖంగారు పడలేదు. అతనిస్థితి ఆమెకు పూర్తిగా తెలుసు. నిత్యమూ అతని మనస్సులో ఆవేదన ఆరని జ్యోతిలా ప్రకాశిస్తూంటుంది. అది కొత్తేమీ కాదు కనుక, ''నా మీద నీకున్న అభిమానానికి నేనెంతో సంతోషిస్తూ వున్నా'' నంటూ అతని ప్రక్కనే కూర్చుని, తన తండ్రిగారి ఆరోగ్యాలను గురించి మాట్లాడుతూవుంది నిర్మల.

ఇంతలో ఏదో స్విచ్ ఆన్ చేసిన శబ్దంతో పాటు కొద్దిగా వెలుతురు కూడా తళుక్కుమనడం చూసి నిర్మల లేచిబయట వరండాలోకి వచ్చేసరికిఒక అ ప రి చి త వ్యక్తి, మెడలో కెమెరా వ్రేలాడుతూ యుండడం చూసింది. ''థాంక్స్'' ''ప్రకాష్ పంపించాడు. ఏకాంతంలో మీ ఆలోచనా భంగిమతో ఫోటో చూడాలని అతని సంకల్పం. అందుచేత మీతో ముందుగా చెప్పే అవకాశంలేక పోయింది. క్షమించాలి. నమస్తే'' గ్రామఫోను రికార్డులాగ యీ మాటలు అప్పగించి ఆయన వెళ్ళిపోయాడు.

యీ పరిస్థితి అర్థంగాక కొంతసేపు అలాగేనిలబడి చూసి తిరిగి లోపలికి వెళ్ళి, ఆయనతో ఏవో మాట్లాడుతోంది. ''అమ్మగారూ!'' అనే జవాన్ పిలుపుకు తలపైకెత్తి చూసింది. జవాను కాదు డ్రైవరు. ''అయ్యగారు మిమ్మ.... పిలుచుకు రమ్మన్నారు. సినిమా.....దగ్గరుంటామన్నారు. యీమాటతో కొంత తేరుకుంది నిర్మల.

''అవును. యీరోజున సినిమాకెళ్ళాలని అనుకున్నాము. కాని యిప్పుడెలా? ఎందుకో మనస్సు కూడా అట్టే బావుండలేదు''. ''అయ్యగార్ని యింటికి రమ్మనమని చెప్పు గోవిందాయ్. కావలసిన బంధువులొచ్చారని చెప్పు'' అనేసి నిర్మల లోపలకు వెళ్ళిపోయింది.

• • •

''హల్లో! ఎంతసేపయి వచ్చారు. ముందుగా లెటరు వ్రాస్తే స్టేషనుకు వచ్చేవాణ్ణే'' ఉత్సాహంతో లోపలకు వస్తూ అన్నాడు ప్రకాష్.

''ఫర్వాలేదు..... కులాసాయేనా?''

''ఆ! ..... నిర్మలా! కాఫీ ఉందా? అంతా మీమామయ్య కంగారులో నీవే.....? అర్థోక్తిలోనే ఆగి వాలుగా లోపల కాఫీ కలుపుతూన్న నిర్మలకేసి చూస్తూ అన్నాడు ప్రకాష్.

''ఆ! మీ భాగం మాత్రం మీకు రిజర్వు చేశా....'' తలవంచుకొని కాఫీ సాసరులో పోస్తూ చిన్నగా నవ్వుతూ అంది.

''ఆ! అవునూ. ఫోటో గ్రాఫరు వచ్చాడా?'' తల ప్రక్కగా పెట్టి ఆమె ముఖంలోకి చూస్తూ అడిగాడు.

''ఆ! మీరు తలిస్తే కానిదేముంది ? కాని మీరు ఆశించినంతగా ఉండకపోవచ్చు''.

''ఏమిటది?'' సంకోచిస్తూ అన్నాడు.

''ఫోటో!''

''ఏం! బాగాలేదా?'' తమాయించుకుంటూ అన్నాడు.

''ఏమో! యిప్పుడే ఏం చెప్పగలము! అయినా మీరు కొన్ని పనులు అయాచితంగా చేస్తుంటారు''.

''ఏమయింది?''

''ఏం కావాలి? నేనూ, మామయ్యా సోఫాలో కూర్చొని మాట్లాడుకుంటున్నాము. యింతలో మీ ఆప్తుడు రావడం, ఫోటో తీయడం, థ్యాంక్సు చెప్పడం కూడా అయిపోయింది, అయినా అంత చూసుకోకుండా ఫోటో తీయడం మీ మిత్రుడులోనే చూశాను.!!....''కొంచెం హేళన భావంతో అంది.

''పోనీ....బాబాయ్ కూడా మనకు నిత్యం కనిపిస్తూంటారు. ఇందుకేనా యింత సొద చెప్పుకొచ్చావ్?'' యిదేం పెద్దవిషయం కాదన్న భావాన్ని వ్యక్తం చేస్తూ అన్నాడు ప్రకాష్.

ఈ మాటలతో నిర్మల హృదయంలోంచి పెద్ద బరువు దిగినట్టయింది. ఆమెకు అత్యుత్సాహం కలిగింది. యీ సన్నివేశానికి భర్త అభిప్రాయం చెడుగా వుంటుందేమోనని ఆమె ఆశించి గాభరా పడింది. కాని యిప్పుడు ఉదయిన హృద

యంలోని భావం అర్థం చేసుకోగలిగింది. మావయ్యను గురించి మొదట్లో, ఆయనకు మంచి అభిప్రాయం లేదనుకొంది. అంతేకాదు. ఆ విషయంలో తనను అనుమానిస్తున్నారేమోననే భావంకూడా కలుగకపోలేదు. కాని అవి అన్నీ తాను వారి హృదయాన్నిఅర్థంచేసుకోలేక అనుకున్నవి గాని వాటిల్లో సత్యం ఏమీ లేదని అనుకొని ధైర్యంగా, ఉబికి వచ్చే ఉత్సాహాన్ని ఆపుకొంటూ ''ఈ రోజు మీకు ఆశాభంగం కల్గించినందుకు నేను చాలా విచారిస్తున్నాను'' కృతజ్ఞత చెప్పినట్టుగా అంది.

''పోయిందేముంది? రేపు పోవచ్చు.... సరిలే. నీ వంకవంట పని చూడూ!.... నేమింతలో అలా బయటకు పోయి వస్తాం....ఏం బాబాయ్? ఇంకాపిలుపుకు ముఖానికి అడ్డం పెట్టుకొని పేపరు చదువుకుంటున్నాయన ఉలిక్కిపడి, కళ్ళజోడు సవరించుకొని, పేపరు టేబిల్‌మీద పెడ్తూ ''అలాగే'' అంటూ లేచాడు.

5

''తెలుసుకోకుండా ఫోటో తీయబడినా ఫోటోకు కావలసిన పద్ధతిలోనే ఉన్నావే!'' ఫోటో చూస్తూ నవ్వుతూ అన్నాడు ప్రకాష్.

''మీరనుకున్నది యిలా కాదుగా, ఏకాంతంలో ఆలోచనా భంగిను చూడాలనే మీ....'' వ్యంగ్యంగా అతని కళ్ళల్లోకి చూస్తూ అంది నిర్మల.

''అదెంత?.... ఏదో ఒకరోజు అదీ బయటపడగలదు'' ఫోటో టేబిల్‌మీద పెడ్తూ ''మీ మావయ్య నీకేం యిచ్చిపోయాడు?'' ఆసక్తిగా ఆమె సమాధానం కోసం చూస్తూ అడిగాడు....''వూఁ....ఏమివ్వాలేం?'' ''ఆ! ఎంతో ప్రేమతో అంత దూరాన్నించి కోడల్ని చూడాలని వచ్చిన మామగారేమీ యివ్వకుండా వెళ్తారా?...'' చిలిపిగా ఆమె చెక్కిళ్ళు తాకుతూ అడిగాడు ప్రకాష్.

''మానవులు ప్రేమపూర్వకంగా యిచ్చిపోగలిగింది మనస్సు మాత్రమే'' అతని బాహువుల్లోంచి తప్పించుకొనే ప్రయత్నం చేస్తూ ఉల్లాసంగా అంది నిర్మల.....''నిజం... మానవుని భవిష్యత్తు మనస్సుమీదే ఆధారపడింది'' యిద్దరూ ఒక్కసారిగా నవ్వారు.

''హల్లో! ప్రకాష్‌బాబు! నేను చాలా విచారిస్తున్నాను. ఆలోచనా భంగిమలో ఫోటో తీయదలచినా, అవివేకం వల్ల అసభ్యకర సన్నివేశాన్ని చిత్రీకరించాను. అందుకు మీ మనస్సు ఖేదపడుతుందని నాకు తెలుసు. అయినా అంత విచ్చలవిడిగా....'' అనలేక వూరుకున్నాడు ఫోటోగ్రాఫరు నాలిక కొరుక్కుని.

''ఓ ! అదా! అసభ్యతేముంది? ఆయన మా బాబాయ్!''

''బతికాను. అయినా అంత యిదేమిటి? ప్రకాష్! మన కుటుంబాలింకా అంత ముందుకు పోలేదు.''

''ప్రగతిని సాధించుకోలేకపోవడం కూడా మానవునిలోని దౌర్బల్యమే.''— అంటూ ప్రకాష్ ఆఫీసు నుంచి బయటకు వచ్చేశాడు. కాని ఎందుకో అతనికి తెలియని అసంతృప్తి అతనిలో బయలుదేరింది. కొంతసేపు బీచ్‌లో కాలక్షేపం చేయాలని అనుకున్నా, ఎంతోసేపు అక్కడ కూర్చోలేకపోయాడు. అస్థిమితస్థితి చేత మనస్సు చాంచల్యంగా ప్రవర్తిస్తోంది. తిన్నగా యింటికి వెళ్ళాడు...ఫోటో టేబుల్‌మీద పెట్టుకొని తదేక దృష్టితో రెప్పవాల్చకుండా చూస్తున్నాడు.

ఒక ప్రక్క తన భార్య నవ్వుతూ ఓరగా తల పైకెత్తి ఆ రెండవ్యక్తి ముఖంలోకి చూస్తోంది. అతను ఆమె ముఖంలోకి చూస్తూ చిరుగానవ్వుతూ వున్నట్టుగా వుంది. ''ఛా! ఏమిటి! చెడు ఆలోచనలు పీడకలల్లా యిలా వేధిస్తున్నాయ్. ఛా! సభ్యతను గ్రహించలేని మాటలకోసం నా వ్యక్తిత్వాన్ని కోలుపోతున్నాను. తండ్రీకూతుళ్ళను, అన్నాచెల్లెళ్ళను చూచి సదభిప్రాయం పొందలేని ప్రాపంచిక వీధిలో పయనించడం పొరపాటు నాదే. ఆయనకి అటువంటి దోషాన్ని ఆపాదించడానికి వీల్లేదు. జీవితప్రారంభ దశలో మాయని గాయం తగిలినా, నిగ్రహంతో, ఆత్మ శక్తితో, ఆధ్యాత్మికపథంలో జీవితాన్ని సానపెట్టుతున్న గొప్ప సాధకుడాయన.''

''కాని నిర్మల మాత్రం ఏమిటంత చనువు... వయస్సును, బాధ్యతలను బట్టి కాకపోయినా సమవయస్కుడులా కనిపించే వ్యక్తితో అంత చనువుగా వర్తించడం, సాంఘిక మర్యాదలను గుర్తించలేని గ్రుడ్డితనంగా ప్రవర్తించడం, ఏమంత బాగుండలేదు.... అందరభిప్రాయాలు ఒకే పద్ధతిలోనే ఉంటాయనుకోడం పొరపాటు. యింతకూ ఆమె చేసిన తప్పేమిటి? ఆయనతో కలసి కూర్చోవడం, మాట్లాడుకోవడం కూడా తప్పేనా? కాదు. సభ్యత, సంస్కారం తెలిసిన నిర్మల తప్పుపని చేసిందని నమ్మడం ఒక తప్పు. ఆ ముఖంలో ద్యోతకమయ్యే భావం కేవలం అనురాగమయమే!..... ఒక మధ్యవయస్కునితో యువ్వనవతియైన స్త్రీ అలా మాట్లాడ్డం చూచి సహించడం చాలా కష్టం....మనస్సులో భావం ముఖమే చెప్పుతోంది.''

''అయితే నిర్మల ఎందుకోసం యీవిధంగా ప్రవర్తించవలసి వుంటుంది? తన నుంచి ఆమె సర్వసౌఖ్యాలూ అందుకుంటోంది. హృదయాన్నర్పించి అందిస్తోందే! ఆ పరిస్థితుల్లో ఆమె కిట్టి తప్పుడు తలంపు కలుగడానికి కారణం?.. తననుంచి ఆమె ఏదయినా అసంతృప్తి పొందుతూంటే ఆ విషయం తేలికగా తెలుసుకోవచ్చు. ఆభావం ఏ సందర్భంలోనయినా, ఎట్టి పరిస్థితుల్లోనయినా ఆమె ప్రవర్తన వల్లనే తెలుస్తుంది. కాని ఆమెలో అటువంటిదేమీ లేదు. ఆమె హృదయం పవిత్రమయింది.... నిష్కల్మషంగా, నిష్కపటంగా ఆమె తనతో వర్తిస్తూంది. అనురాగమయ హృదయాన్ని ఆనందంతో, సంతృప్తితో తనకు అర్పిస్తూనే ఉంది. యీ విషయంలో సందేహంలేదు. బాహ్య విషయాలను దృష్టిలో పెట్టుకొని నన్ను నేను సంకుచితపరచుకోవడం నా మనోదౌర్బల్యమే....కాకపోతే మరేమిటి?''

''ఆయన ముఖంలోని గాంభీర్యం చూస్తుంటే ఆ పెదిమలు చిందే ఆ చిరునవ్వు.. ఆ కనుచూపులో ద్యోతకమయ్యే భావం చూస్తున్నంతసేపు, కొంతవరకూ చెడు అభిప్రాయం కలుగడం సహజం. పుష్పాలలోని మకరందాన్నాస్వాదించి మత్తెక్కిన తుమ్మెదలు కూడా అలాగే ఉంటాయి.. అయితే.. ఇప్పుడు'' పూర్తిగా చైతన్యం కోల్పోయి సోఫాకు చేరగిలపడ్డాడు ప్రకాష్ రెప్పలార్పకతదేక దృష్టితో దూరాన్నుంచే ఆ ఫోటో కేసి చూస్తూ అలాగే కూర్చుండి పోయాడు.

చాలాసేపయాక వంటపని ముగించి గదిలోకి వస్తూ ''అరే! కాఫీ త్రాగేలేదు. ఏమిటబ్బా! అంత దీర్ఘాలోచన!'' అంటూ వెనకనుంచి భుజం తట్టింది. అతను కొయ్యబారి వున్నాడు. స్పృహకలిగినట్టులేదు. ''ఏమండీ? మిమ్మల్నే? ఏమిటది? అలాగున్నారేం?'' కంగారుగా భుజం పట్టి కదుపుతూ అంది. ఖంగారుగా తేరుకున్నాడు ప్రకాష్. బిత్తరగా చూస్తూ నిర్మల మొఖంలోకి చూచి దృష్టి మళ్ళించాడు. అతని భావం అర్థంగాక తత్తర పడుతూన్న నిర్మల అతనికళ్ళు చెమ్మగిల్లడం గమనించి చీర కొంగుతో తుడుస్తూ ''అదేం? యీ రోజు అలాగున్నారేం? మనస్సు బాగాలేదా? ఆమాట ముందుగా చెప్తే నేను యిక్కడే వుండేదాన్నిగా!'' తలనిమురుతూ కాఫీ అందిస్తూ అంది. ''కాఫీ చల్లారిపోయింది. .... వెచ్చ చేసేదా?'' ''తిరిగి వెచ్చచేస్తే అది విషంగా మారుతుంది''... ''సరిలెండి. మళ్ళీ కలిపి తెస్తా'' అంటూ లేవబోయే నిర్మలను వారిస్తూ..... ''జీవితం కూడా చప్పబడినప్పుడు పాకం సరిపోతుంది'' కాఫీకప్పు తీసికొంటూ బరువయిన హృదయావేదన వ్యక్తం చేస్తూ అన్నాడు ప్రకాష్.

ప్రస్తుత పరిస్థితిని అవగాహన చేసుకోలేక, అతని స్థితి చూచి భరించలేక, తొందరగా యిటు అటూ చూస్తూండగా, అతని కెదురుగా, అతని దృష్టికి వేరుగా ఫోటో చూచింది. ''అదే యిందుకు కారణమయిందా? కాదు. ఆవిషయాన్ని గురించి సదభిప్రాయాన్నే ఇదివరకే ఆయన వ్యక్తీకరించడం జరిగింది. అదికాదు. మరేమిటి? ఆఫీసులో ఏదయినా మాట వచ్చిందేమో! ఆఫీసు కార్యకలాపాలలో తప్పుడుగా వుండరే! ఓ! మొన్న నే టైపు చేసిన ఫైల్సు తప్పుగా పడ్డాయేమో! అప్పుడే అనుమానించాను. కాని సరిచేయడం కుదిరిందిగాదు. బహుశా అదే అయివుంటుంది. అందులోనూ అవి కంపెనీ డైరెక్టరుకు పంపే ఫైల్సు. తప్పు పడినందుకు, ఆయన రిమార్కు వ్రాశారేమో''? ''ఏమండీ? మొన్న నే టైపు చేసిన ఫైల్సులో అక్షరాలు పొరబడ్డాయా?'' సమాధాన పరిచే ధోరణిలో అడిగింది.

''అందులో కాకపోయినా జీవిత రికార్డులో అక్షరాలు పొరపాటుగా దొర్లాయి''!

"ఆ!" ఆశ్చర్యంగా చూస్తూ, భయం, ఆతృత వ్యక్తపరిచింది.

"మీరనేదేమిటో నాకర్థం కావడంలేదు. ఏ విషయాన్ని గురించి మీరు మాట్లాడుతున్నారు? ఆతృతగా తడబడుతూ అంది.

"సారాంశం దొరకని విషయాన్ని గురించే ఆలోచిస్తున్నాను"

"అయితే అంత విచారం దేనికి?" బాధగా అడిగింది.

"నిజం తెలుసుకోలేక, అంశాన్ని విస్మరించలేని స్థితిలో విచారం అనేది మనకుతెలియకుండానే..." బరువుగా వూపిరి పీలుస్తూ అన్నాడు.

నిర్మలకి స్థితి అర్ధంకాలేదు. అయినేవిషయాన్ని గురించి బాధపడుతున్నాలో సూటిగా గ్రహించుకోలేక పోయినా, సంసార జీవితమే ఆయన బాధకు కారణమని గ్రహించుకో గలిగినా, అట్టిపరిస్థితులేమీ ఆమెకు గోచరించక సంకట స్థితిలో పడింది. కొంతసేపు మౌనంగా గడిపి తిరిగి నిర్మలే "మీరిలా బాధపడడం నేను సహించలేక పోతున్నాను." కర్కశంగా అంది. "యిందుకు బాధ్యులెవ్వరో చెప్పకూడదా?" సూటిగా అతని కళ్ళల్లోకి చూస్తూ జాలిగా అడిగింది.

"బాధ్యత. వూఁ నా అనాలోచిత కార్యం!"

"యింతకూ మీరనేదేమిటి?" మీకు మీరు బాధపడడంతోటే సరిపోతుందా? విషయం తెలియక బాధ పడడం నేను, విషయం తెలిసి వెల్లడించలేక బాధపడడం మీరూనూ" జీవితకాలంలో యీవిచారానికి అంతం ఉంటుందా? భవిష్యత్తు గలవారూ, బాధ్యత కలిగిన పదవి నిర్వహిస్తున్నవారు. మానసిక దౌర్బల్యానికి లోనయితే కలిగేది.... వారి జీవిత విచ్ఛిత్తి."

"నిజంగా మీరు బాధపడే విషయం నేను వినకూడని అంశమే అయితే నాకంత బలవంతం లేదు. కాని మీరు బాధపడడం చూస్తూ నేను బాధపడకుండా ఉండలేను. బహుశా మీ యీ విచారానికి కారణం నన్ను గురించే అయితే మీభవిష్యత్తు కోసం, మీ సంతోషం కోసం నేనేదయినా సరే త్యాగంచేయవలసి వస్తే నిస్సంకోచంగా చేయగలను. యింతవరకూ నేను ఆలోచించి అర్ధం చేసుకోగలిగింది. ఆ పటమే మీలో అనుమానాన్ని కల్పించిందని అది నిజమని మీరనుకోలేదు. అనుకోరుకూడా. కాని అది చూస్తున్నంతసేపూ మీ మనస్సు ఖేద పడుతూండవచ్చు.. మీరే మాచెల్లెలితో కలిసి ఫోటో తీయించుకున్నప్పుడు మిమ్ములను గురించి ఒక స్త్రీ కూడా అదే అభిప్రాయ పడవచ్చు. యిది కేవలం అనుమానాలకు అవకాశాలను అన్వేషించుకుంటూ ప్రగతి సాగించుకుంటున్న కాలం. యిందుకు బాధ్యత నిర్ణయించడం చాలా కష్టం. తనకు ఏది తృప్తిగలిగించగలిగితే ఆపని చేయడం ద్వారా మానవుడు కొంతవరకూ శాంతి పొందగలడు....." యీమాటలను స్పష్టముగా పూర్తిగా వింటూ, ఆమె కంఠ స్వరంలో కనిపించే మార్పు, ఆమె ముఖంలో ప్రస్ఫుటమయ్యే బాధ, ఆమె మనస్సు పడే ఆవేదన, ఆకళ్ళల్లో కనిపించే జాలి.... గ్రహించిన ప్రకాష్ కొంచెం కంగారుపడి.... స్వస్థత పొందుతూ.

"నిర్మలా! జీవితాన్ని త్యాగం చేసే సందర్భాలలో స్త్రీకుండే ధైర్యం పురుషునికి వుండదు. అంతే కాదు. ఏకష్టాన్నయినా భరించే ఓర్పు, నేర్పు స్త్రీకి వున్నంతగా పురుషునికి వుండదు. ఆవిషయము నాకు పూర్తిగా తెలుసు.... నీవనుకున్న ప్రకారం నాబాధకు కారణం నిజమే. కాని నిన్నుగాని, బాబాయినిగాని ఏపరిస్థితులలోను శంకించలేను. శంకించే శక్తి కూడా నాకు లేదు.కాని యీరోజు నామనస్సు వికలమయింది. యీ ఫోటోలో నీ అనురాగ హృదయ నికి ప్రక్కగా వుండవలసిన నా స్థానంలో మరొక పురుషుడున్నాడనే అవ్యక్త స్థితిలోనే నామనస్సును కొన్నిరకాల తప్పుడు వూహాల్లోకి లాగింది. అంతమాత్రం చేత నేను శంకిస్తున్నానని నేను శాశ్వతంగా ఆవేదనతో మన భవిష్యత్తుకు భంగంగా ప్రవర్తిస్తానని నీవనుకోవద్దు.కొన్ని సందర్భాలలో సహనం కోలుపోవడము మానవునికి ప్రత్యేకంగా పురుషునికి సహజం. దాన్ని తాపీగా ఆలోచించుకొని మానసిక శక్తిని చేకూర్చుకోవడం ద్వారా తిరిగి సహనాన్ని సంపాదించుకుంటుంటారు కొంతమంది పురుషులు. కాని నాకు మనో దౌర్బల్యం ఎక్కువ. నీ సాహచర్యంలో ఆత్మ శక్తిని చేకూర్చుకోగలుగుతున్నానని అనుకొని తృప్తిపడుతున్నాను. దానికి భంగం కలిగించకు నిర్మలా!నేనెప్పుడూనీముందొకవిద్యార్థినే! నిజంగా అనుభవాలమేరకు ప్రతిపురుషుడు జీవితాన్ని గురించి ఎన్నో విషయాలను నిలబడి విద్యార్థిలా నేర్చుకోవలసి వుంటుంది" గద్గదిక కంఠ స్వరంతో ముగించాడు ఆశగా, బాధగా, జాలిగా నిర్మల కళ్ళల్లోకి చూస్తూ.

సహించలేని వ్యథతో బరువెక్కిన నిర్మల హృదయం తేలికయిపోయింది. అంతులేని, అగాధమైన బాధ ఆవరించియున్న నిర్మల క్షణంలో తనలో పవిత్రతను, అనురాగాన్ని వ్యక్తం చేయగలిగింది. ఆమె ముఖం లోకి చూస్తూ "నిర్మలా! యింకా యీవిషయాన్ని గురించి ఆలోచిస్తున్నావా? ఆత్మత్యాగం చేయలేని అసమర్ధుణ్ణి అనుకుంటున్నావా? అవును. నీ వనుకున్నా తప్పులేదు. నేనింతవరకూ అలాగే ప్రవర్తించాను. కాని క్షమా హృదయంలో నాకు స్థానం వుండకపోదు".... కొంత బాధ సూచిస్తున్న స్వరంతో ప్రకాష్ అన్నమాటలకు నొచ్చుకొని "ఏంఫర్వాలేదు. మనలో మనం ఒకరిని ఒకరు క్షమించుకోవడం దేనికి? మీ అభిప్రాయాన్ని నేను కాదనలేను. మీరే కాదు. ఆ పటము చూస్తూంటే ఒకసారి నన్ను నేను నిందించుకున్నాను, కాని చనువుగా ఆప్యాయతగా మామయ్యతో మసలడం నాకు అలవాటు. నా ఆత్మీయులలో ఆతనొకరు. నేనాతనిని పూజ్య భావంతో చూస్తాను. అదే నా చనువుకు కారణం".

"అంతేకాదు. అతనిలో ఉదాత్త భావాలెన్నో వున్నాయి. వాటిని నేను గౌరవిస్తాను. అందుచే నేనాతనితో అరమరికలు లేకుండా వ్యవహరిస్తూంటాను".

"యీ సందర్భంలో నేనీ విషయాన్ని గురించి చెప్పాలనిపిస్తుంది. ఏస్త్రీఅయినా సంసారంలో భర్తతో, సమాన బాధ్యత, ప్రతిపత్తి పొందుతూనే వుంది. దాన్ని ఆమె సంరక్షించుకోలేని దౌర్బల్యం వల్ల ఆమె పతనమవుతుందనే నేను అనుకుంటున్నాను. వ్యక్తిత్వంతో పాటు మానవులు జీవించాలంటే, పవిత్ర హృదయాలలో కరుణ నింపుకొని ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం అలవాటు పడితే స్త్రీపురుష జీవితాలలో సాంఘిక సమస్యే లేదు. అదే లేకపోతే దేశాభ్యుదయం చాలా దగ్గరలోనే వుంటుంది...." ఇంకా ఏదో చెప్పబోతూంది. మధ్యలో అడ్డుపడి "ఆకలి ఎక్కువగా వుంది నిర్మలా!" ఆమె ముంజేతులను బట్టి తనవైపుకు లాక్కుంటూ అన్నాడు. "భోజనం చేద్దురుగాని లేవండి" తన చేతులను లాక్కుంటూ అంది నిర్మల.

"భోజనంతో ఆకలి తీరేలాలేదు నిర్మలా!" ఆమెను తన బాహువుల్లోకి లాక్కుంటూ అన్నాడు. ప్రకాష్ మాటలకు కళ్ళు ఆర్పుతూ "మరెలా?" ప్రకాష్ ముఖంలోకి చూస్తూ అడిగింది..... "నిర్మలా! యిలా! నీ చిరునవ్వుతో" చిలిపిగా ...అన్నాడు ప్రకాష్. నిర్మల నవ్వింది. "జీవితంలో ఆనందం, అనురాగం, సౌభాగ్యం యివే".. అంది.

"అఁ అలాగని ఎవరన్నారు?" అంటూ ఆమె చెక్కిళ్ళు స్పృశిస్తూ అన్నాడు.

"ఎవరా? ఎవరో? 'నిర్మలాప్రకాష్'! అంటూ అతని వక్షస్థలంపై వ్రాలింది.

